నమస్తే తెలంగాణ

# వరంగల్ హనుమకొండ

5 | శుక్రవారం 3 మే 2024 | WARANGAL HANUMAKONDA




న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, చిత్రంలో వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

# సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

**న్యాయవాదులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి**

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన
- బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సోమ భరత్‌కుమార్
- ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి..
- బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్

హనుమకొండ, మే 2: లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన డాక్టర్ సుధీర్ కుమార్‌ను గెలిపించేందుకు న్యాయవాదులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ న్యాయవాది తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా అనేక ఏళ్లుగా సేవలు అందిస్తున్న న్యాయవాదులకు రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన లీగల్ సెల్ కమిటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా కమిటీ సిఫారసుల మేరకే ఎవరికైనా పదవులు, బాధ్యతలను అప్పగిస్తామన్నారు. పార్టీకి కష్ట కాలంలో అండగా ఉండేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన న్యాయవాదులకు దాస్యం కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సోమ భరత్‌కుమార్ మాట్లాడుతూ అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలన ఎమర్జెన్సీ నాటి చీకటి రోజులను గుర్తు చేస్తుందని అన్నారు. అక్రమ కేసులను న్యాయబద్ధంగా ఎదుర్కొంటామని, పార్టీని కాపాడుకునేందుకు లీగల్ సెల్ తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేస్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకలను అక్రమంగా క్రిమినల్ కేసుల్లో ఇరికించి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలే ప్రజాసేవకు దగ్గరి మార్గంగా భావించి రాజకీయాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. విలువలతో కూడిన తన రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలించి తనకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్ రాజు, సీనియర్ న్యాయవాదులు వద్దిరాజు గణేశ్, సోమేశ్వరరావు, శ్యాంసుందర్ రావు, అబ్దుల్ నబీ, రంజిత్ కుమార్, వసంత్ కుమార్, బసవరాజు, మహేశ్ పటేల్, శ్రీనివాసరావు, అరుణ, ఉషశ్రీ పాల్గొన్నారు.



**బజ్జీలేస్తూ.. ఇస్త్రీ చేస్తూ..**

భూపాలపల్లిలో సుధీర్‌కుమార్ ప్రచారం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, రాంనగర్‌లో బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ బజ్జీలేస్తూ.. ఇస్త్రీ చేస్తూ, ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించాడు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజల గొంతుకనై పార్లమెంట్‌లో మన సమస్యలను వినిపిస్తానని సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.



# గులాబీ జోష్

**కేసీఆర్ రోడ్ షోలతో కొత్త ఊపు**

*లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత చేపట్టిన బస్సు యాత్ర గులాబీ కార్యకర్తల్లో జోష్ నింపింది. కేసీఆర్ నేరుగా కార్యరంగంలో దిగడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బస్సు యాత్రకు అనూహ్య స్పందన వచ్చింది. రోడ్‌షోలకు జనం వెల్లువెత్తడంతో పాటు ఆయన ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేశాయి. కేసీఆర్ బస్సు యాత్రతో బీఆర్ఎస్‌కు అనుకూల ఫలితాలు ఉంటాయనే అభిప్రాయాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి.*

*- వరంగల్ ప్రతినిధి/మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ), మే 2*

- బీఆర్ఎస్ అధినేత బస్సు యాత్రకు వెల్లువెత్తిన జనం
- ప్రజలను ఆలోచింపజేసిన ఆయన ప్రసంగాలు
- కార్యకర్తల్లో నూతనోత్సాహం
- వరంగల్, మహబూబాబాద్ సీట్లపై గెలుపు ధీమా

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో లోక్‌సభ ఎన్నికల చిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. బస్సు యాత్రకు ప్రజల స్పందన అనూహ్యంగా ఉండడంతో బీఆర్ఎస్‌కు కచ్చితంగా అనుకూల ఫలితాలు ఉంటాయనే చర్చ జరుగుతున్నది. కేసీఆర్ రోడ్ షో అనంతరం వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు పూర్తి ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కేసీఆర్ రోడ్ షోలో ఎక్కువగా మహిళలు, రైతులు, యువకులు ఉన్నారు. ఈ వర్గాల్లో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు మొగ్గు కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని గుర్తు చేస్తూ రోడ్ షోలలో కేసీఆర్ చేస్తున్న ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు, మూడున్నర కాంగ్రెస్ పాలనకు పోల్చి చూస్తే బీఆర్ఎస్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు గొప్పగా ఉంటున్నాయని పేదలు, మధ్య తరగతిలో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్, మహబూబాబాద్‌లో నిర్వహించిన రోడ్ షోలకు జనం స్పందన అనూహ్యంగా ఉన్నది. వేలాది మంది జనం కేసీఆర్ కోసం గంటల తరబడి ఎదురు చూశారు. ఆయన ప్రసంగాన్ని ఆసాంతం విన్నారు. కేసీఆర్‌తో మమేకమై కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయని తీరుపై ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పారు. కేసీఆర్ రోడ్‌షోలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులు మారెపల్లి సుధీర్‌కుమార్, మాలోత్ కవిత గెలుపు నల్లేరు మీద నడకే అని కార్యకర్తలు భావిస్తున్నారు.

**రోడ్‌షోతో కొత్త ఉత్సాహం**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కొంచెం స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, శ్రేణుల్లో కేసీఆర్ రోడ్ షో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు మొదటి నుంచి గట్టి పట్టున్నది. ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. 2014 నుంచి 2021 వరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ రికార్డు విజయాలను నమోదు చేసింది. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ఒక్క 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు, శ్రేణుల్లో ఒకింత స్తబ్దత వచ్చింది. లోక్‌సభ ఎన్నికల కోసం కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలతో పరిస్థితి పూర్తిగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారింది. 2014, 2019 తరహాలోనే ప్రస్తుత ఎన్నికల్లోనూ వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ రికార్డులను నమోదు చేసే అవకాశం ఉన్నదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఈ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ రికార్డు మెజారిటీతో విజయం సాధించింది. 2015లో వరంగల్ లోక్‌సభకు జరిగిన ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి దేశంలోనే ఏడో అత్యధిక మెజారిటీతో గెలిచారు. 2019 ఎన్నికల్లోనూ రాష్ట్రంలోనే వరంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి రికార్డు మెజారిటీ వచ్చింది. మహబూబాబాద్‌లోనూ ఎప్పుడూ లేనంత మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు కేసీఆర్ రోడ్ షో తర్వాత ఉన్న పరిస్థితికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నదని, ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆధిక్యతను ఏ పార్టీ ఆపబోదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**ఇక ఆరు గ్యారెంటీలకు దిక్కెక్కడిది?**

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత
- కేసీఆర్ గొంతు నొక్కుతున్నారు : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- వరంగల్ జిల్లా బుధరావుపేటలో ఎన్నికల ప్రచారం



బుధరావుపేట ఈదుల చెరువులో ఉపాధి కూలీలను ఓటడుగుతున్న ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు

ఖానాపురం/కొత్తగూడ మే 2 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు.. ఇక ఆరు గ్యారెంటీలకు దిక్కెక్కడిదని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటలోని ఈదులకుంటలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. కూలీలతో కలిసి ఉపాధి పనులు చేశారు. గడ్డపారతో మట్టిని తవ్వి, ఎత్తి ట్రాక్టర్‌లో పోశారు. కొత్తగూడ మండల కేంద్రంలోని అంగడిసెంటర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు. ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలోనే మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తనను తమ ఇంటి ఆడబిడ్డగా ఆదరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు నానా తంటాలు పడుతున్నారని, కనీసం తాగునీటి ఎద్దడిని కూడా నివారించలేక పోయిందన్నారు. ఉన్న నీటి సౌకర్యాన్ని వినియోగించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మార్పు పేరుతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నదన్నారు. తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను రాష్ట్రంలో 48 గంటల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేగులు తీసి మెడలో వేసుకుంటా.. రేగొండ సభలో తుపాకులతో కాల్చేస్తాం.. అన్నప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. రోడ్‌షోలతో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కుట్రలు చేస్తున్నట్లు తెలిపారు. ఖానాపురంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీవెంకటనర్సయ్య, మౌలానా, కొత్తగూడలో ములుగు జిల్లా చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, ఇర్ప సూరయ్య పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో బైక్‌పై ఇంటింటి ప్రచారం చేస్తున్న తూతిక ప్రకాశ్

# బైక్‌పై వినూత్న ప్రచారం

**బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని యాత్ర**

మహబూబాబాద్ రూరల్, మే 2: బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోసం ఓ వ్యక్తి వినూత్నంగా బైక్‌పై యాత్ర చేస్తున్నాడు. భద్రాచలం ప్రాంతం వేలేరు గ్రామానికి చెందిన తూతిక ప్రకాశ్ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాడు. భద్రాచలం నుంచి మానుకోట వరకు 140 కిలోమీటర్ల యాత్రను చేపట్టాడు. కాంగ్రెస్ హామీలు, పేదలకు చేస్తున్న అన్యాయం గురించి ఇంటింటికీ వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నాడు. కాంగ్రెస్, బీజేపీ వల్ల ఒరిగిందేమీ లేదని, పేదలకు బీఆర్ఎస్, కేసీఆర్ తోనే లబ్ధి అనే నినాదంతో ముందుకు సాగుతున్నాడు.

**మళ్లీ కేసీఆరే కావాలంటున్నారు : ప్రకాశ్**

కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలకు ఎంతో ఆదరణ ఉంది. ఆయనే మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడులకు దిగుతున్నారు. అయినా వదలకుండా ప్రచారం చేస్తున్నా.



కంఠాయపాలెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్సీ సిరికొండ మధుసుదనాచారి

# మన ఇంటి పార్టీ బీఆర్ఎస్..

- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు ఖాయం
- ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు పనిచేస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర(తొర్రూరు), మే2: బీఆర్ఎస్ మన ఇంటి పార్టీ అని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని నాంచారిమడూ ర్, వెలికట్ట, భూక్యా తండా, పెద్ద మంగ్యాతండా, టీక్యాతండా, చింతలపల్లి, కొమ్మనపల్లితండా, హచ్చుతండా, గుర్తూరు, కంఠాయపాలెం, ఫతేపురం, పోలెపల్లి, మాటేడు, చెర్లపాలెం, గోపాలగిరి, చీకటాయపాలెం, హరిపిరాల, కర్కాల, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారితో కలిసి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడడం కోసం బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 8 నుంచి 10 సీట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఒక ఉద్యమకారుడికి ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరిగే ఈ ఎన్నికలో తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా తన రాజకీయ సమాధి తప్పదన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేశ్ వర్ధన్నపేట ప్రజలను మోసం చేసిండని, మోసం చేసిన వాళ్లకు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బీఆర్ఎస్ గెలవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, ఎంపీపీ చిన్న అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకు లు సోమేశ్వర్‌రావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

*ప్రతి కార్యకర్త గులాబీ సైనికుడు కావాలి*

- కష్టపడితే గెలుపు బీఆర్ఎస్‌దే
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- స్టేషన్‌ఘన్‌పూర్ ముఖ్య నేతలతో సమన్వయ సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేదికపై స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య తదితరులు

జనగామ, మే 2(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలు.. 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి మరోసారి ప్రజలను మభ్యపెడుతున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ నిజ స్వరూపాన్ని ప్రజల్లో చర్చకు పెట్టి ఓట్లకు వచ్చే నేతలను నిలదీయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం యశ్వంతపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య అధ్యక్షతన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలైన రూ.2లక్షల రుణమాఫీ, 24 గంటల నాణ్యమైన కరెంటు, రూ.15వేల రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, పింఛన్లు రూ.4వేలకు పెంపు తదితర అంశాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ నాయకుల అసలు స్వరూపాన్ని ఎండగట్టాలన్నారు. ప్రజలకు చెప్పిన మాటలు, రైతులకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, అడిగిన ప్రజలను మంత్రులు, ఎమ్మెల్యేలు దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగెస్ హయాంలో కరువుతో వలసలు పోతే తెలంగాణ వచ్చిన తర్వాత వలసలు వాపస్ వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్‌ది కాదా? అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో 45 రోజుల లాక్‌డౌన్‌లో రూపాయి ఆదాయం లేకున్నా అన్ని బిల్లులు ఆపి పంట సీజన్‌కు ముందే రైతుబంధు డబ్బులు వేశామని, మద్దతు, గిట్టుబాటు ధరకు ధాన్యం కొన్నామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కేవలం 5 ఎకరాల వరకే వేశారని, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు గృహజ్యోతి పథకం కింద నెలకు రూ.2500, పింఛన్ రూ.4వేలకు పెంచకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు ఎట్లా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన పనులేంటి.. కాంగ్రెస్ చెప్పి చేస్తున్న పనులేంటో గమనించి, అభివృద్ధి చేసిన వారికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. పదేళ్లలో ఎండిపోని పంటలు, చెరువులు, కుంటలు ఇప్పుడు ఎందుకు ఎండిపోయాయి..? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓటు వేయాలని పల్లా పిలుపునిచ్చారు. కేసీఆర్ అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ వచ్చాక నిలిపివేసిందని ఆరోపించారు. ఎండిన పంటలు చూసి రైతును ఓదార్చేందుకు కేసీఆర్ పొలం బాట పడితే ప్రభుత్వం మేల్కొని నాగార్జునసాగర్, కాళేశ్వరం నీటిని విడుదల చేసినా అదనుకు అందక పంటలు ఎండిపోయాయన్నారు. వరంగల్ అంటేనే బీఆర్ఎస్ అని.. ప్రతిపక్షంలో ఉన్నా పోరాటం చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ టికెట్లు అమ్ముకుంటున్న రేవంత్‌రెడ్డి అంగీలాగును సొంత పార్టీ నాయకులే ఊడ పీకుడు ఖాయమన్నారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లిన వారికే ఎంపీ టికెట్లు కేటాయించి మొదటి నుంచి కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికి మొండిచేయి ఇచ్చారన్నారు. ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే టికెట్లు అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోక పోవడాన్ని చూస్తే ఆ రెండు పార్టీలు ఒక్కటే అని అర్థమవుతుందన్నారు.